ముగిసిన జోనల్‌ స్థాయి క్రీడాపోటీలు



విజేతలకు షీల్డు అందజేస్తున్న హెచ్‌ఎం బాపురెడ్డి, మాజీ ఫిజికల్‌ డైరెక్టర్‌ రమేష్‌రెడ్డి తదితరులు

కుషాయిగూడ: కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాలలో జరుగుతున్న జోనల్‌ స్థాయి క్రీడాపోటీలు శుక్రవారం ముగిశాయి. రెండు రోజులపాటుగా జరిగిన ఈ పోటీల్లో అండర్‌–17 ఖోఖో విభాగంలో జడ్పీహెచ్‌ఎస్‌ కుషాయిగూడ మొదటి స్థానంలో, డాక్టర్‌ కేకేఆర్‌ గౌతమ్‌ స్కూల్‌ ద్వితీయస్థానంలో, అండర్‌–14 బాలికల విభాగంలో జడ్పీహెచ్‌ఎస్‌ కీసర మొదటి స్థానంలో, జడ్పీహెచ్‌ఎస్‌ నాగారం ద్వితీయస్థానంలో నిలిచింది. కబడ్డీలో అండర్‌–14 బాలుర విభాగంలో సెయింట్‌ జోసఫ్‌ బేథాని మొదటి స్థానంలో, శ్రీసాయి మోడల్‌ హైస్కూల్‌ ద్వితీయస్థానంలో నిలిచింది. అండర్‌–17 బాలుర విభాగంలో జడ్పీహెచ్‌ఎస్‌ కుషాయిగూడ మొదటి స్థానంలో, డాక్టర్‌ కేకేఆర్‌ గౌతమ్‌ మోడల్‌ స్కూల్‌ ద్వితీయ స్థానంలో నిలిచింది. వాలీబాల్‌ అండర్‌–17 బాలుర విభాగంలో జడ్పీహెచ్‌ఎస్‌ కుషాయిగూడ మొదటి స్థానంలో, డాక్టర్‌ కేకేఆర్‌ గౌతమ్‌ మోడల్‌ స్కూల్‌ ద్వితీయస్థానంలో నిలువగా అండర్‌–17 బాలికల విభాగంలో టీఎంఆర్‌ఈఎస్‌ కుషాయిగూడ మొదటి స్థానంలో నిలువగా, విజ్ఞాన్‌ గ్లోబల్‌ స్కూల్‌ ద్వితీయస్థానంలో నిలిచింది. పాఠశాల ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో విజేతలకు కుషాయిగూడ హెచ్‌ఎం బాపురెడ్డి, రిటైర్డ్‌ ఫిజికల్‌ డైరెక్టర్‌ రమేష్‌రెడ్డి చేతుల మీదుగా షీల్డులను అందజేశారు.

పరిసరాల పరిశుభ్రతకు నడుం బిగిద్దాం

బోడుప్పల్‌: స్వచ్ఛ భారత్‌లో భాగంగా పరిసరాల పరిశుభ్రతకు నడుం బిగిద్దామని బోడుప్పల్‌ కమిషనర్‌ జి.రామలింగం పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 2, 12, 13, 23 డివిజన్‌ల్లో ఇంటింటికీ తిరిగి తడి, పొడి చెత్తపై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్‌ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తడి, పొడి చెత్తను వేరు చేసి స్వచ్ఛ ఆటోలకు అందించాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, వ్యాధులు రాకుండా ఉండేందుకు చర్యలు తీసుకుందామన్నారు. అనంతరం కాలనీవాసులకు రోడ్లను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్‌ కొత్త లక్ష్మీరవిగౌడ్‌, కార్పొరేటర్లు బొమ్మక్‌ కల్యాణ్‌కుమార్‌, దానగల్ల అనిత యాదగిరి, రాసాల వెంకటేశ్‌యాదవ్‌, శానిటరి ఇన్‌స్పెక్టర్లు బి.నారాయణరెడ్డి, శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతి



వినతిపత్రం అందచేస్తున్న న్యూబొల్లారం కాలనీవాసులు

అల్వాల్‌: మచ్చబొల్లారం, న్యూబొల్లారం కాలనీలో డ్రైనేజీ, రోడ్లు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ అసోసియేషన్‌వాసులు శుక్రవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ని కలిసి వినతిపత్రం అందచేశారు. దీనిపై ఈటల రాజేందర్‌ స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్‌ వాసులు కందుకూరి కరుణశ్రీ, మాచర్ల శ్రీనివాస్‌, అనురాధ, ఉదయప్రకాష్‌, దయాకర్‌, రాఘవేంద్రచారి, రమాకాంత్‌, పన్నాల రాజరెడ్డి, వెంకట్‌రెడ్డి, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

మురుగు సమస్యను పరిష్కరించండి

మల్లాపూర్‌: ఓల్డ్‌ మల్లాపూర్‌ నుంచి నోమా వెళ్లేకు దారిలో నిత్యం డ్రైనేజీతో పాదచారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. డ్రైనేజీ నీరు పారి రోడ్డు బురదమయ మారుతుందని కాలనీవాసి రాపోలు శ్రీనివాస్‌ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా తూతూ మంత్రంగా పనిచేసి వెళ్లిపోతున్నారు తప్పా శాశ్వత పరిష్కారం చూపడంలేదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్య పునరావృతం కాకుండా చూడాలన్నారు.



ఓల్డ్‌ మల్లాపూర్‌లో రోడ్లపై పొంగుతున్న డ్రైనేజీ

చర్లపల్లి రైల్వే టర్మినల్‌ను సందర్శించిన కార్పొరేటర్‌



కుషాయిగూడ: ఆధునాతన హంగులతో రూపుదిద్దుకుంటున్న చర్లపల్లి రైల్వే టర్మినల్‌ను శుక్రవారం చర్లపల్లి కార్పొరేటర్‌ బొంతు శ్రీదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తన డివిజన్‌లో చర్లపల్లి రైల్వే టర్మినల్‌ ప్రారంభం కావడం సంతోషకరమన్నారు. గతంలో బొంతు రాంమోహన్‌ మేయర్‌గా ఉన్న సమయంలో టర్మినల్‌ ఏర్పాటుకు పునాదులు పడటం మరింత సంతోషమన్నారు. త్వరలోనే ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌ రెడ్డి చేతుల మీదుగా చర్లపల్లి రైల్వే టర్మినల్‌ ప్రారంభం కానుందన్నారు. రైల్వే టర్మినల్‌ ప్రారంభమైతే చర్లపల్లి ప్రాంతం అభివృద్ధి చెందడటంతో పాటుగా ఉపాధి అవకాశాలు మెండుగా కలిసివస్తాయని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు సురేష్‌కుమార్‌, రవికుమార్‌తో పాటుగా స్థానిక నేతలు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అత్యద్భుతంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌దే

మాజీ మంత్రి హరీష్‌రావు



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు


కాప్రా: గత పదేళ్లలో తెలంగాణను కేసీఆర్‌ అత్యద్భుతంగా తీర్చిదిద్దారని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామో అందరికీ తెలుసని పరోక్షంగా కాంగ్రెస్‌ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. శుక్రవారం ఏఎస్‌రావునగర్‌ డివిజన్‌ టీఎస్‌ఐఐసీ కాలనీలో బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకుడు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో యువసేన ఏర్పాటు చేసిన గణనాథుడి నిమజ్జన కార్యక్రమంలో హరీష్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గతంలో గణేష్‌ ఉత్సవాలు అంటే బాంబే వైపు చూసేవారని, కానీ ఇప్పుడు గణేష్‌ ఉత్సవాలు అంటే దేశంతో పాటు ప్రపంచం మొత్తం హైదరాబాద్‌ వైపు చూస్తుందన్నారు. గణనాథుడి ఉత్సవాల సందర్భంగా యువసేన యూత్‌ ఆధ్వర్యంలో లక్కీ డిప్‌ నిర్వహించారు. లక్కీ డిప్‌ ద్వారా స్కూటీని గెలుచుకున్న గాయత్రి కుటుంబానికి హరీష్‌రావు చేతుల మీదుగా సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో యువసేన యూత్‌ సభ్యులు స్కూటీని అందించారు. చక్రీపురంలో నేమూరి మహేష్‌గౌడ్‌ ఆధ్వర్యంలో రేబల్‌ యూత్‌ ఏర్పాటు చేసిన గణనాథుడి నిమజ్జనోత్సవానికి మాజీ మంత్రి హరీష్‌రావు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కాలేరు వెంకటేష్‌, రాగిడి లక్ష్మారెడ్డి, బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్‌ సింగిరెడ్డి శిరీషరెడ్డి, మాజీ కార్పొరేటర్‌ కొత్త రామారావు, కాసం మహిపాల్‌రెడ్డి, నేమూరి మహేష్‌గౌడ్‌ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల భద్రతకు ప్రాధాన్యం

మల్కాజిగిరి: బీజెఆర్‌నగర్‌లో ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇస్తామని కార్పొరేటర్‌ ప్రేమ్‌కుమార్‌ అన్నారు. శుక్రవారం కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొనివచ్చారు. అనంతరం కార్పొరేటర్‌ ప్రేమ్‌కుమార్‌ మాట్లాడుతూ కొండ (గుట్ట)ప్రాంతంలో పేద ప్రజలు చాలా సంవత్సరాలుగా నివాసముంటున్నారని ఇటీవల వర్షాలకు రాళ్లుపడి కొన్ని ఇల్లు దెబ్బతిన్నాయన్నారు. వారి భద్రత కోసం రిటైనింగ్‌ వాల్‌ నిర్మాణంతో పాటు, దెబ్బతిన్న మెట్ల (స్టెప్స్‌) పునఃనిర్మాణం, విద్యుత్‌ పోల్స్‌, ట్రాన్స్‌ఫార్మర్ల షిఫ్టింగ్‌ పనులు చేపడుతామన్నారు. దీనికి ప్రతిపాదనలను సిద్ధం చేయాలని సూచించామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

అటకెక్కిన ఆరోగ్య కేంద్రాల నిర్వహణ?

- నిధుల కొరతతో కునారిల్లుతున్న హెల్త్‌ సెంటర్లు
- పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీల నిర్వహణకు హెచ్‌డీఎస్‌ కింద ఏటా రూ. 1.75 లక్షలకు బ్రేక్‌
- ఏడాదికి జిల్లాలోని 38 ఆరోగ్య కేంద్రాలకు రావలసిన నిధులు రూ. 66.55 లక్షలు
- 2 ఏళ్లుగా నిధులు రాకపోవటం రోగులకు తప్పని ఇబ్బందులు



సాక్షి, సిటీబ్యూరో: రెండేళ్లుగా నిధుల లేమితో జిల్లాలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణ ఆటకెక్కింది. ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణకు ప్రతి ఏటా హెచ్‌డీఎస్‌ (హాస్పిటల్‌ డెవలప్‌ మెంట్‌ సొసైటీ) ద్వారా ఒక్కొక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రూ. 1.75 లక్షలు అందజేసేది. ఈ నిధులు రెండేళ్లుగా విడుదల కాక పోవటంతో ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహణ లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. నగర శివారు మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో మొత్తంగా 38 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. ఇందులో 26 యూపీహెచ్‌సీలు ఉండగా, పీహెచ్‌సీలు 12 ఉన్నాయి. వీటిలో 8 పీహెచ్‌సీలు, 5 యూపీహెచ్‌సీలు రోగులకు 24 గంటల వైద్య సేవలు అందిస్తున్నాయి. ఈ ఆరోగ్య కేంద్రాలన్నింటిలోనూ నిధుల లేమితో నిర్వహణ అంతంత మాత్రంగానే కొనసాగుతోంది. ముఖ్యంగా ఆస్పత్రికి వచ్చే రోగులకు కనీస వసతులు కల్పించలేని పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. ఇన్‌పేషంట్లకు తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్ల వసతి కల్పించలేని దుస్థితి ఏర్పడుతోంది. ఇటీవల కలెక్టర్‌ పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మూత్రశాల, మరుగు దొడ్లను పరిశీలించారు. హెచ్‌డీఎస్‌ (హాస్పిటల్‌ డెవలప్‌ మెంట్‌ సొసైటీ) నిధులు రావటం లేదనేనెపంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహణ సక్రమంగా లేదని తెలుసుకున్నారు.

కలెక్టర్‌ అసంతృప్తి...

ఆరోగ్య కేంద్రాల నిర్వహణ తీరుపై జిల్లా వైద్యాధికారిని ఆరా తీసిన కలెక్టర్‌ అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిస్థితి ఇలాగే ఉందనడంలో అతిశయోక్తిలేదు. వివిధ రకాల పరీక్షల కోసం బయటికి రాస్తుండటంతో ఇక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండీ లాభమేంటనే ప్రశ్నలు పలువురి నుంచి ఉత్పన్నమవుతున్నాయి.

- హెచ్‌ఎఎస్‌ నిధులు విడుదల కాకపోవటం వల్లనే ఆరోగ్య కేంద్రాల నిర్వహణ కష్టమవుతోంది. దీనిని గుర్తించిన కలెక్టర్‌ తన నిధి నుంచి తక్షణమే ఆరోగ్య కేంద్రాల నిర్వహణకు నిధులను విడుదల చేసినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ వర్గాలు పేర్కొంటున్నారు.
- ఈ విషయమై పీహెచ్‌సీల వైద్యాధికారులు మాట్లాడుతూ... ప్రభుత్వం నుంచి నిర్వహణ నిధులు రావటం లేదని పేర్కొంటున్నారు. ఇవే కాకుండా ఇతర పథకాలకు సంబంధించిన నిధులు కూడా విడుదల కాలేదంటున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు.
- నిర్వహణ నిధులు విడుదల రాగానే సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో కనీస వసతుల పరంగా ఏలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామని పేర్కొంటున్నారు.

వేం నరేందర్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్‌ నేతలు

హబ్సిగూడ: తెలంగాణ ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని శుక్రవారం ఉప్పల్‌ నియోజకవర్గ కాంగ్రెస్‌ నాయకుడు జనుంపల్లి వెంకటేశ్వర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్టీ విషయాలపై చర్చించి, పార్టీలో పనిచేస్తున్న వారికి న్యాయం జరిగేలా చూడాలన్నారు. నామినేటెడ్‌ పోస్టుల్లో అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్‌ పావనీరెడ్డి, నాయకులు తవిడబోయిన గిరిబాబు తదితరులు ఉన్నారు.

యూట్యూబర్‌పై కేసు నమోదు

ఉప్పల్‌: పోలీసులపై అనుచిత వ్యాఖ్యలతో రీల్స్‌ చేసిన యూట్యూబర్‌పై ఉప్పల్‌ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఉప్పల్‌ ఇన్‌స్పెక్టర్‌ ఎలక్షన్‌రెడ్డి వెల్లడించారు. చిలుకానగర్‌కు చెందిన యూట్యూబర్‌ బల్‌వీర్‌ సింగ్‌(27) తన ఇద్దరు స్నేహితులతో కలిసి ప్రముఖ డియో కంపెనీపై కేసు పెడుతున్నట్లు రీల్స్‌ చేసి సోషల్‌ మీడియాలో పోస్టు చేశాడు. పోలీసులపై అనుచిత వ్యాఖ్యలకు గాను విచారించి వారిపై కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

న్యాయవాదిని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు

మల్కాజిగిరి: న్యాయవాదిని బెదిరించిన వ్యక్తి పై మల్కాజిగిరి పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ గణేష్‌ బాబు తెలిపిన వివరాల ప్రకారం... మౌలాలి హనుమాన్‌నగర్‌లో దయానంద్‌ అలియాస్‌ దేవ న్యాయవాదిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. భూ వివాదానికి సంబంధించి అనూష కేసును దయానంద్‌ వాదిస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 19వ తేదీ రాత్రి దయానంద్‌ ఆఫీస్‌ కార్యాలయంలోకి సంతోష్‌ (అనూషతో వివాదం ఉన్న వ్యక్తి) అనుచరులతో చొరబడి దయానంద్‌తో పాటు అతని సోదరుని చంపుతామని బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ సంఘటనపై దయానంద్‌ శుక్రవారం తోటి న్యాయవాదులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌కు సహకరించండి

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్‌లో స్వచ్ఛ సర్వేక్షణ్‌కు సహకరించాలని కార్పొరేటర్‌ శ్రవణ్‌ కోరారు. ఓల్డ్‌ మల్కాజిగిరి బొడ్రాయి సమీపంలో వీధిలో చెత్త వేసే పాయింట్‌ను ఆయన డీసీ రాజు, ఎఎంహెచ్‌ఓ డాక్టర్‌ మంజులతో కలిసి పరిశీలించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకూడదని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రవణ్‌ మాట్లాడుతూ ఇంటింటికి వచ్చే చెత్తబండ్లలో మాత్రమే చెత్త వేయాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తవేసే వారిపై నిఘా ఉంచి జరిమానా విధించాలన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్‌ శ్రీనివాస్‌, ఎస్‌ఎఫ్‌ఎ గిరి, ఉపేందర్‌, నర్సింగ్‌ తదితరులు పాల్గొన్నారు.

గౌడల సంక్షేమానికి గణేష్‌గౌడ్‌ విశేష కృషి

అల్వాల్‌: గౌడ కులస్తుల సంక్షేమానికి గణేష్‌గౌడ్‌ ఎంతో కృషి చేశారని గౌడ సంఘం హాస్టల్‌ అధ్యక్షులు చక్రవర్తిగౌడ్‌ అన్నారు. శుక్రవారం అల్వాల్‌లో వేమూరి గణేష్‌గౌడ్‌ వర్థంతి వేడుకల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసిన ఘన నివాళులు అర్పించారు. అనంతరం ఉచిత వైద్య శిబిరం, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేమూరి సాయిరాంగౌడ్‌ కుటుంబ సభ్యులు, అల్వాల్‌ గౌడ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో మర్రి రాజశేఖర్‌రెడ్డి పర్యటన



పార్కు స్థలాన్ని పరిశీలిస్తున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్‌: వెంకటాపురం డివిజన్‌ పరిధిలోని బ్యాంకు కాలనీలో పార్కు స్థలాన్ని కబ్జా చేస్తున్నారని విషయాన్ని కాలనీవాసులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో శుక్రవారం పార్కు స్థలాన్ని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తహసీల్దార్‌ రాములుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్కు స్థలం కబ్జాకు పాల్పడిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని, స్థలం కబ్జాకు గురికాకుండా చూడాలని ఆయన తహసీల్దార్‌ని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌ సబిత అనిల్‌కిషోర్‌, కాలనీవాసులు చక్రధర్‌, లక్ష్మీనారాయణ, చిన్నపురెడ్డి, అనిల్‌, జనార్దన్‌, నాయకులు రమేష్‌, విజయ్‌శేఖర్‌, రాజు, రాము, రమేష్‌, గిరిధర్‌, రాజునాయక్‌, తదితరులు పాల్గొన్నారు.

నేరెడ్‌మెట్‌లో పోషణ మాసోత్సవం



నేరెడ్‌మెట్‌లో పోషణ మాసోత్సవంలో మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్‌: అంగన్‌వాడీ టీచర్లు గర్భిణులు, బాలింతలకు సరైన సలహాలు, సూచనలు చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సూచించారు. పోషణమాసం కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్‌ అల్వాల్‌ ప్రాజెక్ట్‌ ఆధ్వర్యంలో మల్కాజిగిరి, అల్వాల్‌ సెక్టార్‌ మాసోత్సవం శుక్రవారం నేరెడ్‌మెట్‌లోని జీకె.సరస్వతి ఫంక్షన్‌హాలులో జరిగింది. ఈ కార్యక్రమానికి మర్రి రాజశేఖర్‌ రెడ్డి హాజరై మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలపై సంపూర్ణ అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో స్వాతి, కార్పొరేటర్లు సబిత అనిల్‌కిషోర్‌, మీనా ఉపేందర్‌రెడ్డి, మేకల సునీత రాముయాదవ్‌, మాజీ కార్పొరేటర్‌ శ్రీదేవి, నాయకులు రావుల అంజయ్య, పరుశురామ్‌రెడ్డి, హన్మంతరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్‌ ఏఎస్‌రావుకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా: భారత అణుశాస్త్రవేత్త, ఈసీఐఎల్‌ సంస్థ వ్యవస్థాపకుడు, పద్మ భూషణ్‌ పురస్కార గ్రహీత డాక్టర్‌ ఏఎస్‌రావు జయంతి ఏఎస్‌రావునగర్‌లో ఘనంగా నిర్వహించారు. 110వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్‌ సింగిరెడ్డి శిరీషారెడ్డి, మాజీ కార్పొరేటర్‌ కొత్త రామారావు, బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, కాసం మహిపాల్‌రెడ్డి, కుమారస్వామి, బేతాళ బాలరాజు, రాఘవరెడ్డి, రహీం, మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ సరఫరా ఉండని ప్రాంతాలు

మల్లాపూర్‌: భవానీనగర్‌ 11 కేవీ ఫీడర్‌ పరిధిలో విద్యుత్‌ ఫీడర్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్‌ సరఫరా ఉండదని మల్లాపూర్‌ ఏఈ తెలిపారు. బీరప్పగడ్డ, భవానీనగర్‌, ఓల్డ్‌ మల్లాపూర్‌, గ్రీన్‌హిల్స్‌ కాలనీ, హెచ్‌సీఎల్‌కాలనీ, మైస్లవర్‌ పార్క్‌, నాగలక్ష్మీనగర్‌, న్యూ భవానీనగర్‌, ఎస్వీనగర్‌ కాలనీలలో విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

గౌతంనగర్‌: విద్యుత్‌ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాలల్లో విద్యుత్‌ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు. 33/11 కేవీ గౌతంనగర్‌ సబ్‌స్టేషన్‌ పరిధిలోని 11 కేవీ భవానీనగర్‌ ఫీడర్‌ పరిధిలో శనివారం ఉదయం 10:30 నుంచి 11 గంటల వరకు సాయినగర్‌, సంతోష్‌నగర్‌, భవానీనగర్‌, గీతనగర్‌, సంజయ్‌నగర్‌లో విద్యుత్‌ సరఫరా ఉండదని, అదే విధంగా 33/11 కేవీ వసంతపురి కాలనీ సబ్‌స్టేషన్‌ పరిధిలోని 11 కేవీ రాఘవేంద్రనగర్‌ ఫీడర్‌ పరిధిలో ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓల్డ్‌ మల్కాజిగిరి, మారుతీనగర్‌, నర్సింహారెడ్డినగర్‌, బాల సరస్వతినగర్‌లలో విద్యుత్‌ సరఫరా ఉండదని విద్యుత్‌ అధికారులు తెలిపారు.

ఆంజనేయనగర్‌ ఫీడర్‌ పరిధిలో..

బోడుప్పల్‌: విద్యుత్‌ మరమ్మతుల కారణంగా 11కేవీ ఆంజనేయనగర్‌ ఫీడర్‌ పరిధిలోఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పలు కాలనీల్లో విద్యుత్‌ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ మైలారం స్వామి వెల్లడించారు.

నగరంలో భారీ వాహనాలకు నిబంధనలు విధించాలి

మల్లాపూర్‌: నగరంలో భారీ వాహనాల మూలంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలంగాణ ఆటోమోటార్స్‌ డ్రైవర్స్‌ ట్రేడ్‌ యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య అన్నారు. భారీ వాహనాల రాకపోకలపై నగరంలో నిబంధనలు విధిస్తే ప్రమాదాలు నివారించవచ్చన్నారు. నగరంలో భారీ వాహనాలపై నిబంధనలు విధించాలని శుక్రవారం రాచకొండ కమిషనర్‌ సుధీర్‌బాబుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మారయ్య మాట్లాడుతూ.. భారీ వాహనాల మూలంగా హబ్సిగూడ చౌరస్తాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పదో తరగతి చిన్నారి ప్రాణాలు కోల్పోవడం ఎంతో దురదృష్టకరమన్నారు. ఈ ప్రమాదాలు ఎక్కువగా ఉదయం, సాయంత్రం వేళల్లో జరుగుతున్నాయని, ఈ సమయాల్లో స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు, ఇతర కార్యకలాపాలపై వెళ్లే వారు ఎక్కువగా ఉంటారని, అదే సమయంలో భారీ వాహనాలు తిరుగుతుండటం వల్ల ప్రమాదాల బారినపడి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్‌, కాలేజీ, ఆఫీస్‌ ప్రారంభం, ముగింపు సమయాల్లో భారీ వాహనాలను అనుమతించకుండా నిబంధనలు విధించాలని కోరారు. దీంతో కొంత మేరకైనా ప్రమాదాలు నివారించవచ్చని కోరారు.

కళ్యాణలక్ష్మి చెక్కుల అందజేత



చెక్కులు అందచేస్తున్న మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు

అల్వాల్‌: మల్కాజిగిరి నియోజకవర్గం అల్వాల్‌ సర్కిల్‌కు చెందిన పలువురు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కులను శుక్రవారం అల్వాల్‌ తహసీల్దార్‌ కార్యాలయంలో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి చేతులమీదుగా అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ కాంగ్రెస్‌ ప్రభుత్వం ప్రకటించిన కళ్యాణలక్ష్మి చెక్కులతో పాటు తులం బంగారం ఇచ్చే ప్రయత్నం చేయాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్‌ రెడ్డి, సబిత అనిల్‌కిషోర్‌, తహసీల్దార్‌ రాములు, ఆర్‌ఐ రమ్య, నాయకులు డోలి రమేష్‌, ఢిల్లీ పరమేష్‌, అనిల్‌కిషోర్‌గౌడ్‌, శరన్‌, గిరి, యాదగిరిగౌడ్‌, ప్రశాంత్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.

వైభవంగా విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం



రామంతాపూర్‌: శ్రీనివాసపురంలోని వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శుక్రవారం విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ యజ్ఞ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. హాజరైన ప్రముఖులు మాట్లాడుతూ.. విశ్వ సృష్టికర్త విశ్వకర్మ అని మహాభారత కాలంలోనే ఆయన నిర్మించిన మయసభయే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు డాక్టర్‌ వేములవాడ మదన్‌మోహన్‌ చారి, స్థానిక విశ్వకర్మ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్‌చారి, ప్రధాన కార్యదర్శి రామచంద్రచారి, కోశాధికారి కోటి, ఉపాధ్యక్షులు కుమార్‌ చారి, సెక్రటరీ నాగరాజు చారితో పాటు ఎన్‌వీఎస్‌ఎస్‌ ప్రభాకర్‌, కార్పొరేటర్‌ శ్రీవాణి వెంకట్‌ పాల్గొన్నారు.

ఏడుకాలనీల డ్రైన్‌ ఔట్‌లెట్‌ సమస్యను పరిష్కరించండి



వినతిపత్రం అందచేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్‌: మచ్చబొల్లారం డివిజన్‌ పరిధిలోని ఏడు కాలనీలకు మంచినీటి కనెక్షన్లు ఇవ్వాలని, కాలనీలకు డ్రైన్‌ ఔట్‌లెట్‌ లేని కారణంగా సమస్యాత్మకంగా మారిందని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఏడు కాలనీల డ్రైన్‌ ఔట్‌లెట్‌ సమస్య పరిష్కరించాలని కోరుతూ అన్ని కాలనీల సభ్యులతో కలిసి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం హెచ్‌ఎండబ్ల్యూఎస్‌ఎస్‌బీ ఎండీ. అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌ శాంతి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పరుశురామ్‌రెడ్డి, జీకె. హన్మందరావు, మధుసూదన్‌రెడ్డి, రమేష్‌, రాముయాదవ్‌, ప్రశాంత్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వానికి సీనియర్‌ సిటిజన్ల అల్టీమేటం



తీర్మానం చేస్తున్న సీనియర్‌ సిటిజన్‌లు

ఉప్పల్‌: తమ న్యాయమైన డిమాండ్లను అక్టోబర్‌ 1వ తేదీలోపు కనీసం రెండింటినైన నెరవేర్చాలని లేని పక్షంలో అక్టోబర్‌ 1న జరుపుకునే వయోవృద్ధుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనబోమని తెలంగాణ స్టేట్‌ ఆల్‌సీనియర్‌ సిటిజన్స్‌ అసోసియేషన్‌ ముక్తకంఠంతో తీర్మానిస్తూ అల్టీమేటం జారీ చేసింది. ఈ మేరకు ఉప్పల్‌లో నిర్వహించిన సమావేశంలో అసోసియేషన్‌ అధ్యక్షుడు నరసింహారెడ్డి మాట్లాడుతూ.. తమ డిమాండ్ల సాధనకు ఉద్యమించాలని తీర్మానించామన్నారు. ప్రత్యేక వయోధికుల సంక్షేమ శాఖను ఏర్పాటు చేసి నిధులను కేటాయించాలని, వయోధికుల భవన నిర్మాణానికి నగరంలో కనీసం రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని, వారికి సహాయం అందించడానికి 100, 104 లాంటి ప్రభుత్వ శాఖ ద్వారా హెల్ప్‌లైన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్‌ చేశారు.

వివాహిత మృతికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలి



పోలీస్‌ స్టేషన్‌ ఎదుట ధర్నా చేస్తున్న మృతిరాలి బంధువులు

మేడిపల్లి: మా కుమార్తె మృతికి కారణమైన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని మృతురాలి కుటుంబసభ్యులు, బంధువులు మేడిపల్లి పోలీస్‌ స్టేషన్‌ ఎదుట ధర్నాకు దిగారు. బోయిగూడకు చెందిన చింతల అరుణ (29)కు పెద్దపల్లికి చెందిన రాజేష్‌తో ఐదు నెలల క్రితం వివాహం జరిగింది. వారు బోడుప్పల్‌ ఆర్‌ఎన్‌ఎస్‌ కాలనీలో నివాసం ఉంటున్నారు. బుధవారం రాత్రి భర్త ఇంట్లో లేని సమయంలో అరుణ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం విధితమే. కాగా తమ కూతురిని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని శుక్రవారం పోస్టుమార్టం అనంతరం పోలీస్‌ స్టేషన్‌ ఎదుట కుటుంబ సభ్యులు, బంధువులు మృతదేహంతో ధర్నా చేశారు. అరుణ మృతికి కారణమైన భర్త రాజేష్‌, అత్తామమ, ఆడపడుచులను అరెస్టు చేసి శిక్షించాలని కోరారు.